క్లుప్తంగా

వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ల): వ్యక్తిగత పరిశుభ్రతతో ఆరోగ్యంగా ఉండవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.అనంతలక్ష్మి చెప్పారు. మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం–2లో కిశోరి వికాసం కార్యక్రమం శుక్రవారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మి కిశోర బాలికలకు విద్య ప్రాముఖ్యత, సైబర్ నేరాలు, ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపు.. తదితర అంశాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. యోగా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వీవో ఆళ్ల రమాదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ

ఎంపీడీవో జి.కాశయ్య

నకరికల్లు: జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్దే సరుకుల పంపిణీ జరుగుతుందని ఎంపీడీవో జి.కాశయ్య శుక్రవారం తెలిపారు. ఉదయం 8 నుంచి 12 గంటలలోపు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 లోపు సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. వికలాంగులు, 65 సంవత్సరాల పైబడిన వారికి ప్రతి నెల 1వ తేదీ నుంచి 5వ తేదీ వరకు మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 వరకు వారి ఇళ్ల వద్దే పంపిణీ చేస్తారని అన్నారు. కోవిడ్ విస్తరిస్తున్న నేపథ్యంలో మాస్కులు ధరించి రేషన్ షాపుల వద్ద సరుకులు తీసుకోవాలని సూచించారు.

రేపటి నుంచి దుకాణాల వద్దే రేషన్ పంపిణీ

నరసరావుపేట రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూన్ నెల 1వ తేదీ నుంచి రేషన్‌ను చౌక ధరల దుకాణం వద్దనే పంపిణీ చేయ డం జరుగుతుందని తహసీల్దార్ కె.వేణుగోపాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ, మండల పరిధిలోని రేషన్ కార్డుదారు లు సమీపంలోని చౌకధరల దుకాణం వద్ద 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు నిత్యావసర సరుకులు పొందాలని సూచించారు. 65 సంవత్సరాలు పైబడిన, వికలాంగులు, మంచం పట్టిన వ్యక్తులకు 5వ తేదీ లోపు ఇంటి వద్దకు చేరవేస్తారని తెలిపారు.

వైభవంగా బొడ్రాయి వార్షికోత్సవం

శావల్యాపురం: మండలంలోని కనమర్లపూడి గ్రామంలో వేంచేసియున్న నాభిశిల (బొడ్రాయి) 13వ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయాన్నే నాభిశిలను మహిళలు మంచినీటితో శుద్ధిచేసి పసుపు, కుంకుమతో ప్రత్యేక పూజలు చేశారు. పూజారులు హరిశర్మ ఆధ్వర్యంలో నాభిశిల వద్ద పంచామృత అభిషేకాలు, వాస్తు హోమం, నవగ్రహ పూజలు, నాభిశీతలాంభ విశేష పూజలు నిర్వహించారు. గ్రామస్తులు పార్టీలకు అతీతంగా అందరు పూజల్లో పాల్గొన్నారు. గ్రామంలో నలువైపులా ఉన్న గమిడిరాళ్ళకు పూజలు చేపట్టారు. నాభిశిలను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు. మాజీ సర్పంచ్ బోడెపూడి అంజలీప్రసాదు కుటుంబ సభ్యులు సారథ్యంలో భారీ అన్నదానం ఏర్పాటు చేశా రు. స్థానిక ఎమ్మెల్యే ప్రభుత్వ ఛీప్ విప్ జీవీ ఆంజనేయులు, సర్పంచి తన్నీరు భారతి, మాజీ శాసనసభ్యులు మక్కెన మల్లిఖార్జునరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్శకేంద్రుడు దాసరికి నివాళి

వినుకొండ: దర్శకేంద్రుడు దాసరి నారాయణ రావు వర్ధంతి సందర్భంగా గుమ్మడి కళాపీఠం ఆధ్వర్యంలో స్థానిక వెంకటేశ్వర స్టూడియోలో దాసరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కళాపీఠం అధ్యక్షుడు గుమ్మడి మాట్లాడుతూ దాసరి దర్శకత్వం వహించిన సినిమాలు చరిత్రలో నిలిచిపోతాయన్నారు. సమాజాన్ని మేల్కొలిపే చిత్రాలు అనేకం తీశారన్నారు. కార్యక్రమంలో భీమవరం ఏడుకొండలు, మందేపల్లి లక్ష్మీనరసయ్య, ఎం. వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, ముదికోటి మహేశ్వరరావు, రావిపాటి వీరయ్య, బొంకూరి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ శిబిరాన్ని సద్వినియోగించుకోండి

శావల్యాపురం: స్థానిక గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన తరగతులను చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని శావల్యాపురం గ్రంథాలయ అధికారి గంగవరపు అర్జున్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0– 5 నుంచి 15 సంవత్సరాల లోపు వయస్సు కల్గిన చిన్నారులకు ఉదయం 8 గంటల నుంచి 12 గంటల పుస్తక పఠనం, కథలు చెప్పటం, రాయటం, స్పోకెన్ ఇంగ్లిషు, చిత్రలేఖనం, సంగీతం, నాట్యం, ఉపన్యాసం అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అనంతరం చిన్నారులకు క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాససింగ్, చెన్నుబాబు, మద్దికుంట ఆంజనేయులు, సనిశెట్టి వెంకట గురు వీరాంజినేయులు, చెవల శ్రీరాములు ఉన్నారు.

తీరంలో ఈత.. కుటుంబానికి తీరని వెత

- కృష్ణానది తీరంలో రక్షణ కరువు
- సరదాగా ఈతకు దిగి మృత్యువాత పడుతున్న యువకులు
- కుటుంబానికి కడుపుకోత మిగుల్చుతున్న వైనం

అచ్చంపేట: కృష్ణానది సమీపంలో ఉన్న సత్తెమ్మతల్లి ఆలయం, పులిచింతల ప్రాజెక్టు, కృష్ణా నది తీరాల సందర్శనకు వచ్చే ఎంతో మంది సరదాకు ఈత కొట్టేందుకు నది లోతులు తెలియక దిగి ఇసుక గోతుల్లో, నది లోతుల్లోకి వెళ్లి గల్లంతవ్వడం, రెండో రోజో.. మూడో రోజో శవమై కనిపించడం పరిపాటైంది. ఇంత జరుగుతున్నా కృష్ణానది తీరంలో రక్షణ కరువైంది. కనీసం ప్రమాద హెచ్చరిక బోర్డులు కూడా కనిపించడం లేదు. సుదూర ప్రాంతాల నుంచి రావడం, నది తీరానికి వెళ్లి సరదాగా ఈత కొట్టేందుకు నదిలో దిగి కుటుంబాలను దిక్కులేని అనాథలను చేసి తీరని వెతను మిగుల్చుతున్నారు.

సుదూర ప్రాంతాల వారే అధికం

కృష్ణా నదిలో మృత్యువాత పడే వారిలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చేవారే ఎక్కువగా ఉంటున్నారు. మాదిపాడుకు సమీపంలోని అటవీ ప్రాంతంలో ఉండే సత్తెమ్మతల్లిని దర్శించుకునేందుకు ప్రతి ఆదివారం వందల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. అక్కడకు దగ్గరలోనే ఉండే పులిచింతల ప్రాజెక్టు వద్దకు వెళ్లి, అక్కడ నుంచి ప్రాజెక్టు దిగువన ఉండే మాదిపాడు, గింజుపల్లి ఇసుక రేవుల వద్ద ఈత కొట్టేందుకు దిగుతున్నారు. ఇసుక కోసం తీసిన గుంతలు ఎక్కడ ఉన్నాయో తెలియక లోతుల్లోకి వెళ్లి పోవడం, పాచిపట్టిన రాళ్లపై కాలువేసి జారి నదిలో పడిపోయి నదీ ప్రవాహానికి కొట్టుకుపోవడం జరుగుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు ఉండటంతో విద్యార్థులు సాయంత్రం సమయంలో సరదాకు కృష్ణా నది తీరానికి వెళుతున్నారు. కొంతమంది ఈతకు నదిలో దిగి గల్లంతవుతున్నారు.

సగటున నెలకు ఒకరు మృతి

పెదకూరపాడు నియోజకవర్గంలోని అచ్చంపేట, అమరావతి కృష్ణానది తీరాలలో సగటున నెలకు ఒకరు చొప్పున నదిలో ఈతకు దిగి మృత్యువాత పడుతున్నారు. మృతి చెందే వారిలో ఎక్కువగా 20 నుంచి 30 సంవత్సరాలలోపు వారే కావడం గమనార్హం. ఆసరాగా నిలవాల్సిన కొడుకులే పుత్రశోకం మిగిల్చి వెళ్లిపోతున్నారని తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు తల్లడిల్లిపోతున్నారు.

రక్షణ కరువు

ఇంత జరుగుతున్నా కృష్ణా నది తీరాలలో ఎక్కడా ప్రమాద హెచ్చరిక బోర్డులు కాని, రక్షణ ఏర్పాట్లు కాని లేకపోవడం గమనార్హం. దీంతో ఈతకు నదిలో దిగే వారికి ఇసుక గుంతలు ఎక్కడున్నాయో, నదిలో రాళ్లు ఎక్కడున్నాయో, ఎక్కడ దిగితే ప్రమాదమో తెలియక మృత్యు ఒడిలోకి జారుకుంటున్నారు. అచ్చంపేట మండలంలో ఎక్కువగా గింజుపల్లి, చామర్రు, చింతపల్లి, అంబడిపూడి, కోనూరు, కోగంటివారిపాలెం గ్రామాల వద్ద కృష్ణా నదిలో ఇసుకను పొక్‌లెయిన్లస్ ద్వారా తవ్వుతుంటారు. అయితే గుంతలు తవ్వుకొని జేబులు నింపుకుంటున్నారు గానీ, తవ్విన చోట కనీసం హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. నదిలో నీళ్లు ఉంటే పైకి అంతా మామూలుగానే కనిపిస్తుంది. ఈతకు దిగే ప్రదేశంలోనూ బాగానే ఉంటుంది.. మరో అడుగు ముందుకు వేస్తే ఇసుక కోసం తీసిన గుంత ఉండి గుంతలో కూరుకుపోతున్నారు. సుమారు 20 నుంచి 30 అడుగుల లోతు గోతిలో పడితే రక్షించడం పక్క వారికి కూడా సాధ్యపడదు. గజ ఈతగాళ్లు వస్తే గాని మృతదేహాన్ని కూడా తీసే అవకాశం ఉండదు.



గింజుపల్లి వద్ద మృతదేహం కోసం చేపల పడవల ద్వారా గాలిస్తున్న జాలర్లు



గింజుపల్లి వద్ద కృష్ణానదిలో మృతి చెందిన ఆలపర్తి కృష్ణారావు

మూడు నెలల్లో ముగ్గురు మృతి

గత మూడు నెలల కాలాన్ని పరిశీలిస్తే కృష్ణానదిలో పడి నెలకు ఒక్కరు చొప్పున ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు.



అమరావతి వద్ద రాజేష్ మృతదేహం



కోగంటివారిపాలెం వద్ద.. రాంకుమార్

- మార్చి 4న అచ్చంపేట మండలం, ఓర్వకల్లు గ్రామానికి చెందిన కోట రాంకుమార్(28) కోగంటివారిపాలెం వద్ద కృష్ణా నదిలో ఈతకు దిగి మృతి చెందాడు.
- ఏప్రియల్ 2న అమరావతికి చెందిన సంవత్సరాల నల్లకుంట్ల రాజేష్(24) అమరావతి దేవాలయ సమీపంలోని నదిలో ఈతకు దిగి మృతి చెందాడు.
- మే 25న నకరికల్లు మండలం, చాగల్లు గ్రామానికి చెందిన ఆలపర్తి సైదారావు(43) సత్తెమ్మతల్లి దే వాలయానికి వచ్చి మొక్కుబడులు తీర్చుకుని, గింజు పల్లి వద్ద కృష్ణానదిలో ఈత కు దిగి మృతి చెందారు.

ముగ్గురూ ఈత కొట్టేందుకు వారి స్నేహితులతో దిగి మృతి చెందిన వారే. సంబంధిత అధికారులు ఇప్పటికైనా కృష్ణానది తీర గ్రామాల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఉంచడం గానీ, కనీసం గ్రామ రెవెన్యూ అసిస్టెంటును కాపలా ఉంచడం గానీ చేస్తే ప్రమాదాలను అరికట్టే అవకాశాలున్నాయి.

50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ

నకరికల్లు: పాడి రైతులను ఆదుకునేందుకు తెల్ల రేషన్ కార్డు కలిగిన పశు పోషకులకు 50 శాతం రాయితీపై పశువుల దాణా పంపిణీ చేయనున్నట్లు వెటర్నరీ ఏడీఏ వెంకటేశ్వర్లునాయక్ శుక్రవారం తెలిపారు. తెల్ల రేషన్ కార్డు కలిగిన రైతులందరూ నేరుగా నకరికల్లులోని పశు వైద్యశాలలో సంప్రదించి దాణా తీసుకెళ్లాలన్నారు. రెండు పెద్ద పశువులకు, ఒక దూడకు 90 రోజులకు సరిపడా దాణా సరఫరా చేస్తామన్నారు. రూ.1,100 విలువ గల 450 కేజీల దాణా 50 శాతం రాయితీపై రూ.555కు అందిస్తామన్నారు. మండలంలోని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎండీయూ వాహనాలను కొనసాగించాలి

పెదకూరపాడు: ఎండీయూ వాహనాలు అగ్రిమెంట్ వరకు కొనసాగిస్తే ప్రభుత్వానికి వచ్చే నష్టమేంటని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ మండలి పెదకూరపాడు నియోజకవర్గ అధ్యక్షుడు కంచర్ల అచ్యుతరావు ప్రశ్నించారు. ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం నిరుద్యోగాన్ని తగ్గించడానికి అర్హులైన వారికి ఆరు సంవత్సరాల అగ్రిమెంట్‌తో ఎండీయూ వాహనాలను మంజూరు చేసిందన్నారు. ముగ్గురు డీలర్లు చేసే పంపిణీని ఎండీయూ వాహనం ద్వారా సుమారు 2 వేల రేషన్ కార్డుదారులకు చేసేలా చర్యలు తీసుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఎండీయూ వాహనాలను రద్దు చేయడం దుర్మార్గమని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎండీయూ వాహనాల రద్దును వెనక్కి తీసుకొని అగ్రిమెంట్ వరకు కొనసాగించాలని డిమాండ్ చేశారు.

వ్యాయామ ఉపాధ్యాయులకు యోగా శిక్షణ తరగతులు

పెదకూరపాడు: జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా యోగా శిక్షణ కార్యక్రమాలు చేపట్టింది. ఈ మేరకు సత్తెనపల్లి డివిజన్ స్థాయి వ్యాయామ ఉపాధ్యాయులకు సత్తెనపల్లి డివిజన్‌లోని అన్ని మండలాల్లో యోగా కో ఆర్డినేటర్‌ను నియమించి శిక్షణ తరగతులను ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి యోగా కో ఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ డివిజనల్‌లోని వ్యాయామ ఉపాధ్యాయులకు జూన్ 21 వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో యోగా మన నడవడికను, ఆరోగ్యాన్ని మెరుగు పరుస్తుందన్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లి బాలికల ఉన్నత పాఠశాల, పెదకూరపాడు హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయులకు యోగా శిక్షణ తరగతులను నిర్వహించారు. కార్యక్రమంలో యోగా శిక్షకులు ఉన్నం పద్మావతి, సునీత, ఆర్.శ్రీధర్, లాకు పిచ్చయ్య, ఆలపాటి అరుణశ్రీ, అనిల్‌దత్, అమరావతి వినోద్‌కుమార్, మండల యోగా కో ఆర్డినేటర్లు పాల్గొన్నారు.



యోగ చేస్తున్న ఉపాధ్యాయులు

రైల్వే అండర్ పాస్‌లో నీరు.. వాహనదారుల అవస్థలు



రెడ్డిగూడెం రైల్వే గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జిలో చేరిన వర్షం నీరు

రాజుపాలెం: రైల్వే అండర్ పాస్‌లో నీళ్లు చేరడంతో వాహనదారులు నానా అవస్థలు పడుతున్నారు. గత వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు అండర్ పాస్‌లో భారీ స్థాయిలో నీళ్లు చేరడంతో సుమారు 8 ఊళ్లకు రాకపోకలు బంద్ అయ్యాయి. మండలంలోని రెడ్డిగూడెం రైల్వే స్టేషన్ సమీపంలోని రైల్వే గేటును తొలగించేందుకు రెండు అండర్ పాస్ బ్రిడ్జిలు ఏర్పాటు చేశారు. ఈ బ్రిడ్జిలు భూమి మట్టానికి 15 అడుగుల లోతులో ఉండడంతో భారీ స్థాయిలో వర్షం నీళ్లు చేరాయి. దాదాపు 10 అడుగుల లోతు వరకు నీళ్లు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. దొడ్లేరు, హసాన్‌బాద్, వన్నాయపాలెం, గరికపాడు, నాగవరం, మొక్కపాడు, బ్రాహ్మణపల్లి తదితర గ్రామాలకు చెందిన వారు మాచర్ల–గుంటూరు రహదారికి రావాలంటే ఈ అండర్ పాస్ బ్రిడ్జిల నుంచి వెళ్లాలి. దీని వలన ఆయా గ్రామాల వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. రెండు రోజుల క్రితం ధాన్యం లారీ హసాన్‌బాద్ వెళ్లేందుకు అండర్ పాస్ నుంచి వెళుతుండగా ఇరుక్కుపోవడంతో పది అడుగుల నీరు ఉండడంతో సుమారు 20 బస్తాల ధాన్యం తడిసిపోయాయి. రైల్వే అధికారులు స్పందించి నీరు వెళ్లే మార్గం ఏర్పాటు చేయాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.

బాలికలకు రక్షణ కల్పించాలి

సత్తెనపల్లి: లింగ వివక్ష విడనాడి, ఆపదలో ఉన్న బాలికలకు రక్షణ కల్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పి.ప్రమీల అన్నారు. ఐసీడీఎస్ సత్తెనపల్లి ప్రాజెక్టు పరిధిలోని పట్టణంలోని రెండో వార్డు అంగన్‌వాడీ సెంటర్ (ఎస్టీ)లో శుక్రవారం కిశోరి వికాసం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సూపర్‌వైజర్ ప్రమీల మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికలకు ఎలాంటి ఆపద వచ్చినా 100కు ఫోన్ చేయాలన్నారు. ఆడపిల్లలను స్వేచ్ఛగా జీవించనీయాలని ఆడపిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. రోజు అరగంట యోగా చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అనంతలక్ష్మి, రాణి, కిశోర బాలికలు తదితరులు ఉన్నారు.

బాలికలు భవిష్యత్తును మెరుగు పరచుకోవాలి

అచ్చంపేట: బాలికలు వారి భవిష్యత్తును మెరుగు పరచుకోవడానికి, కుటుంబ పోషణలో తల్లిదండ్రులకు సాయపడడానికి సమాజంలో ఒక మంచి భాగస్వామ్యం కలిగి ఉండేందుకు రూపొందించిందే కిశోరి వికాసం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం తెలిపారు. కిశోరి వికాశం కార్యక్రమంలో భాగంగా మండలంలోని కోనూరు, అచ్చంపేట గ్రామాలలో శుక్రవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల అభివృద్ధి, సాధికారత కోసం, కౌమార బాలికలకు విద్య, ఆరోగ్యం, పోషకాహారం, పరిశుభ్రత, ఆత్మరక్షణ, మానవ అక్రమ రవాణా, బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించడమే కిశోరి వికాశం ముఖ్య ఉద్దేశమన్నారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యా సంస్థల్లో కిశోరి వికాసం బృందాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. బాలికలు వారికి ఎదురయ్యే సమస్యలను ఎలా ఎదుర్కోవాలో వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశా వర్కర్స్, మహిళా పోలీసులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఆడపిల్లల పట్ల చిన్నచూపు విడనాడాలి సీడీపీఓ శ్రీలత

మాదల(ముప్పాళ్ళ): ఆడపిల్లల పట్ల చిన్నచూపు విడనాడాలని లింగ వివక్ష చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత చెప్పారు. మండలంలోని మాదల అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం జరిగిన కిశోరి వికాసం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రక్తహీనత, బాల్య వివాహాలతో అనర్థాలు, సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఏసీడీపీవో సంతోషికుమారి, డీసీపీవో యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రశాంత్, అవుట్ రీచ్ వర్కర్ నానమ్మలు పాల్గొని వ్యక్తిగత పరిశుభ్రత, బాలల హక్కుల పరిరక్షణ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కిశోర బాలికలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

క్రోసూరు, హసనాబాద్‌లలో కిశోరి వికాసం

క్రోసూరు: మండల కేంద్రమైన క్రోసూరు ఎస్టీ కాలనీలోని అంగన్‌వాడీ 9వ కేంద్రంలో శుక్రవారం కిశోరి వికాసంలో భాగంగా బాలికలకు ఆర్థిక అంశాల నిర్వహణ, పొదుపుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్రోసూరు సెక్టార్ సూపర్‌వైజర్ వణుగూరి మాధవి పాల్గొని మాట్లాడుతూ డబ్బు ఒక సాధనమని, దానిని తెలివిగా ఉపయోగించాలన్నారు. ఆర్థిక అవసరాలు మూడు రకాలని, ప్రతి ఒక్కరు పొదుపు చేయటం ఎంతో అవసరమన్నారు. ఇంటి అవసరాలకనుగుణంగా బడ్జెట్‌ను తయారు చేసుకోవాలని, మనీ మేనేజ్‌మెంట్‌పై కుటుంబంలో చర్చించాలన్నారు. మీరు నేర్చుకున్న విషయాలు మీ స్నేహితులు, తోబుట్టువులతో చర్చించి వారికి కూడా నేర్పించాలన్నారు. కార్యక్రమంలో కిశోర బాలికలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

హసనాబాద్ గ్రామంలో మండలంలోని 88త్యాళ్లూరు సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, వివాహ నిరోధక చట్టం, పోక్సో చట్టం, బాల కార్మికుల చట్టంపై సెక్టార్ సూపర్‌వైజర్ మైమున్నీసాబేగం వివరించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఎంఎస్‌కే, ఏఎన్‌ఎంలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ప్రమీల



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాణిక్యం



క్రోసూరులోని కిశోరి వికాసం కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి



మాదలలో మాట్లాడుతున్న ప్రశాంత్, పక్కన సీడీపీఓ శ్రీలత తదితరులు

అరుపులు.. కేకలతో దద్దరిల్లిన కౌన్సిల్

- ఫైనలివ్వందే సచివాలయాల్లో పనులు కావడం లేదు
- రేషన్ కార్డులకు భారీగా వసూళ్లు
- అర్ధంతరంగా ముగిసిన కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు

సత్తెనపల్లి: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశం శుక్రవారం అరుపులు, కేకలతో దద్దరిల్లింది. కొద్దిసేపు ఎవరు ప్రశ్నిస్తున్నారో.. ఎవరు సమాధానం చెబుతున్నారో తెలియని పరిస్థితి నెలకొంది. మున్సిపల్ కౌన్సిల్ సాధారణ, అత్యవసర సమావేశాలు మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీతులసి అధ్యక్షతన శుక్రవారం జరిగాయి.

- తొలుత 22వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ శెట్టి ఆనంద్ మాట్లాడుతూ సచివాలయాల్లో ప్రతి పనికి నగదు వసూలు చేస్తున్నారని, కౌన్సిలర్ చెబితే అదనంగా వసూలు చేయడమే కాక, కౌన్సిలర్‌కు చెప్పవద్దని చెబుతున్నారని విప్ దీనిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో చెప్పాలన్నారు.
- విప్ ఏడో వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ మాట్లాడుతూ కౌన్సిలర్లు చెబితే అదనంగా వసూలు చేయడమేకాక మరోసారి కౌన్సిలర్లకు చెబితే పనులు చేయమని బెదిరిస్తున్నారని, స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ చెప్పినప్పటికీ ఎందుకు సచివాలయాల సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నించారు. సచివాలయ ఉద్యోగులు కనీసం సమయపాలన పాటించడం లేదన్నారు.
- కమిషనర్ ఎం.ఆనంద్‌కుమార్ సమాధానం ఇస్తూ వసూళ్లకు పాల్పడిన వారికి నోటీసులు జారీ చేస్తానని, ఇకపై అవినీతి రహితంగా సేవలందించేలా చర్యలు తీసుకుంటామన్నారు.
- నాల్గో వార్డు కౌన్సిలర్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ మాట్లాడుతూ ఇటీవల ఏడో వార్డు పరిధిలో ఏరియా వైద్యశాల నుంచి రైల్వే స్టేషన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారని, కానీ ఆ రోడ్డులో ఎక్కడా ఒక్క గుంత కూడా లేదన్నారు. గుంతలు లేకుండానే రహదారి నిర్మాణం చేపడుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పురపాలక సంఘంలో ఇంటి, నీటి పన్నులు వసూలు చేసి సొంత బిల్లులు ఇచ్చి ఖజానా బిల్లులు మింగారని, వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా కేవలం వలంటీరు నుంచి రూ.1.60 లక్షలు వసూలు చేసి, అతన్ని తప్పించారన్నారు. కమిషనర్, మున్సిపల్ మేనేజర్, ఆర్వో, ఆర్ఐల పాత్ర ఉందని, వారిపై ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణకు ఫిర్యాదు చేస్తానని, దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు కూడా పెడతానన్నారు.
- కమిషనర్ ఆనందకుమార్ మాట్లాడుతూ దీనిపై స్పెషల్ ఆడిట్ వేస్తున్నామని, దానిలో ఎవరి పాత్ర ఎతుందో తెలుసుకుని వారిపై చర్యలకు సిఫార్సు చేస్తామన్నారు.
- మున్సిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరనాయక్ మాట్లాడుతూ ఏరియా వైద్యశాల నుంచి రైల్వే స్టేషన్ వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసినప్పటికీ, బాగున్నా కూడా రోడ్డు వేయాల్సిన పని ఏముందని, బాగులేని చోట రోడ్డు నిర్మాణానికి ఎందుకు నిధులు మంజూరు చేయలేదని ప్రశ్నించారు.
- మున్సిపల్ కో ఆప్షన్ మెంబర్ కొణతం స్వాతి అజెండాలోని 23వ అంశంపై మాట్లాడుతూ దరువూరి వంశీకృష్ణ బిల్డింగ్ పర్మిషన్ కొరకు దరఖాస్తు ప్లాన్‌ను రోడ్డు వైడెనింగ్ కారణంతో ఏపీ సీఆర్‌డీఏ అథారిటీ తిరస్కరించినందున వారు చెల్లించిన రూ.22,62,044.28 మొత్తం నుంచి బిల్డింగ్ అప్లికేషన్ చార్జీలు రూ.10 వేలు, డెవలప్‌మెంట్ చార్జీలు రూ.68,650, లేబర్ సెస్ కాంపోనెంట్ రూ.2,84,312 మినహాయించుకుని మిగిలిన మొత్తం తిరిగి చెల్లించడానికి పెట్టారని, ఇదెలా సాధ్యామని ప్రశ్నించారు.
- అత్యవసర, సాధారణ సమావేశానికి సంబంధించిన అజెండాలోని అంశాలను ఆమోదించకుండానే రెండు సార్లు చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి సమావేశం ముగిసిందంటూ బెల్ కొట్టారు. దీంతో కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు బయటకు రావడంతో కేవలం ఐదుగురు కౌన్సిలర్లు ఉండగా, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ రంగిశెట్టి సుమన్‌కుమార్ 25వ అంశం డీసెంట్ ఇచ్చామని, మిగిలిన అంశాలు ఆమోదించినట్లు ప్రకటించినప్పటికీ కౌన్సిలర్లు లేక సమావేశం అర్ధంతరంగా ముగిసింది. సమావేశంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ షేక్ నాగూల్‌మీరాన్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సెక్షన్ హెడ్‌లు పాల్గొన్నారు.



సమావేశంలో చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసి



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు

సేవలో విద్యకే తొలి ప్రాధాన్యం

యడ్లపాడు: అనాథ బాలల విద్యాభ్యున్నతికి ఇన్నర్‌వీల్ క్లబ్ భారీ విరాళాన్ని అందించింది. యడ్లపాడు మండలం కొత్తపాలెం (పుట్టకోట) గ్రామంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక గురూజీ రవిశంకర్ ఆశ్రమ పాఠశాల(ఆర్ట్ ఆఫ్ లింగ్)కు రూ.10.20 చెక్కును శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట అధ్యక్షురాలు గట్టు సరోజిని మాట్లాడుతూ క్లబ్ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాల్లో పేద కుటుంబాలకు చెందిన పిల్లలకు ఉచిత విద్య, సౌకర్యాలను అందించడంలో ఇన్నర్‌వీల్ తొలి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ఇందులో భాగంగానే మద్ది లక్ష్మయ్య గ్రూప్స్ కంపెనీ డైరెక్టర్ మద్ది వెంకటేశ్వరరావు, లలితమ్మ దంపతుల ఆర్థిక సహకారంతో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట ఆధ్వర్యంలో రూ.10.20 లక్షల విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ నిధులతో ఆశ్రమ పాఠశాలలో మూడు బ్లాక్‌ల్లో మరుగుదొడ్ల నిర్మాణం, పుస్తకాలు, తాగునీటి సౌకర్యాలు ఇతరేత్ర వాటిని సమకూర్చనున్నట్లు వెల్లడించారు. క్లబ్ డిస్ట్రిక్ చైర్మన్ ప్రేమలత మాట్లాడుతూ ఆధ్యాత్మిక గురూజీ రవిశంకర్ ఆధ్వర్యంలో కొండవీడు కొండల నడుమ పచ్చని ప్రకృతితో అనాథ విద్యార్థుల కోసం ఆశ్రమ పాఠశాల నిర్వహించడం పేద కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇక్కడ 180 మంది పిల్లలకు మానవత విలువలతో ఉచిత విద్యను అందిస్తున్నారన్నా రు. ఇన్నర్‌వీల్ చిలకలూరిపేట శాఖ ఇంతటి భారీ విరాళాన్ని సేకరించి అందించడం అభినందనీయమన్నారు.